# అమ్మ మౌనం

-ఎం.వెంకటేశ్వరరావు

కాలింగ్‌బెల్ శబ్దానికి తలుపు తీసిన కృష్ణమూర్తి, ఎదురుగా కనిపించిన విశ్వనాథం, జానకిలను చూసి ఆశ్చర్యపోయాడు. అదనపు లగేజీ ఏమీ లేకుండా, వెళ్లేటప్పుడు పట్టుకెళ్లిన లగేజీతోనే తిరిగొచ్చిన స్నేహితుణ్ణి, అతని భార్యని లోపలికి ఆహ్వానించాడు.

కృష్ణమూర్తి భార్య అన్నపూర్ణ ఇద్దరికీ చల్లని మంచినీళ్లిచ్చింది.

"ఏమిట్రా విశ్వం! అమెరికా నుండి అకస్మాత్తుగా ఊడిపడ్డావు!"

"అనుకోకుండా బయల్దేరాం రా!"

"అనకాపల్లి నుంచి వచ్చినంత తీరిగ్గా చెబుతావేంట్రా! అమెరికా నుండి అనుకోకుండా రావడమేంటి?"

"చెప్తాన్లే".

"కొడుకులూ, కోడళ్లూ, మనవలు బాగున్నారా?" అన్నపూర్ణ జానకిని అడిగింది.

"ఆ... అందరూ నిక్షేపంగా ఉన్నారు."

"అన్నపూర్ణా! భోజనం ఏర్పాట్లు చూడు.... ఈ లోపల స్నానం చేసేస్తారు" భార్యతో అన్నాడు కృష్ణమూర్తి.

"ఇప్పుడేం వద్దమ్మా! వచ్చేటప్పుడు హోటల్లో తినొచ్చాం."

"ఒరేయ్! నీ అలవాట్లు నాకు తెలియనివి కావులే కానీ ముందు స్నానం చేసిరా. భోంచేద్దువు గానీ", అని, భార్యవైపు తిరిగి "త్వరగా కానియ్యవోయ్" అని చెప్దామనుకునే లోపలే ఆమె కిచెన్‌లోకి వెళ్లింది.

జానకి స్నానం చేసి, కిచెన్‌లో ఉన్న అన్నపూర్ణ దగ్గరకొచ్చింది.

"రండి! వచ్చిలా కూచోండి. ఏమిటి అమెరికా విశేషాలు?"

"ఇక్కడికి అక్కడ పచ్చ, అక్కడికి ఇక్కడ పచ్చ అని వాళ్ల వాతావరణం, నాగరికత వేరు."

"కొన్నేళ్ల వరకూ మీరు రారని అనుకున్నాం."

"ఆయనకి ఉండాలనే ఉంది. పిల్లలూ వెళ్లొద్దని గొడవ చేశారు. నేనే.. ఇమడలేకపోయాను."

"అవున్లెండి. పుట్టి పెరిగిన ఊరుని, పరిచయమైన ప్రదేశాల్నీ చూడకుండా ఎన్నాళ్లుండగలం" అంటూ తరిగిన బంగాళదుంప ముక్కల్ని భాండీలో కాగుతున్న నూనెలో వేసింది అన్నపూర్ణ.

"మీ అమ్మాయి స్నేహ, అల్లుడు బాగున్నారా?"

"మొన్న ఉగాదికే వచ్చెళ్లారు. స్నేహ నెల తప్పింది."

"చాలా సంతోషం. మరి ప్రశాంత్ ఇంకా పుణెలోనే ఉన్నాడా?"

"లేదు. ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాదొచ్చి రెణ్ణెళ్లయింది. వాడు పన్జేస్తున్న కంపెనీ హైటెక్ సిటీ దగ్గరుందట. రోజూ ఈ ట్రాఫిక్‌లో అంత దూరం వెళ్లి రావటం కష్టమని, అక్కడికి దగ్గర్లో.. ఓ ఫ్లాట్‌లో ఉంటున్నాడు.

"అన్నపూర్ణా అయిందా?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఐదు నిమిషాల్లో వడ్డిస్తున్నాను..."

స్నానం చేసొచ్చిన విశ్వనాథాన్ని చూసి "రా! రా! ఇలా కూచో.. ఊ,., ఏమిటీ?... సంగతులు?"

కృష్ణమూర్తి "ఊ...." అనటంలో తన మనస్సులో నిగూఢంగా ఉన్న నిశ్శబ్దాన్ని ఛేధించే యత్నం చేస్తున్నాడని గ్రహించిన విశ్వనాథానికి పెదవి విప్పక తప్పలేదు.

మౌనం మాట్లాడబోయేసరికి, బింకం కోసం అదిమిపెట్టుకున్న అశ్రువులు ఇహ ఆగలేమంటూ, విశ్వనాథం కళ్ల నుండి రాలడం, అది చూసిన కృష్ణమూర్తి కంగారుగా...

"ఒరేయ్ విశ్వం! ఏంట్రా ఇది?.. ఏమైంది?.. ఊర్కో.. ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందాం. లే! భోంచేద్దువురా!" అని ఆప్యాయంగా భుజం మీద చెయ్యేసేసరికి, ఉప్పెనలా రాబోయే అశ్రువుల్ని బలవంతంగా ఆపేసి, భోజనానికి లేచాడు విశ్వనాథం.

కమ్మటి భోజనం, నెయ్యితో అన్నపూర్ణ కొసరి కొసరి వడ్డిస్తుంటే, కృష్ణమూర్తి పక్కన కూచుని కబుర్లు చెబుతుంటే, చాలా నెలల తర్వాత తృప్తిగా తిన్నారు విశ్వనాథం, జానకిలు.

వరండాలో పక్కపక్కనే వేసిన మంచాల మీద కూచున్నాక "ఇప్పుడు చెప్పరా! విశ్వం ! అమెరికాలో కొడుకుల దగ్గరే సెటిల్ అవుతున్నానని అందరికీ చెప్పెళ్లి. మూణ్నాళ్ల ముచ్చటగా ఆర్నెళ్లు తిరక్కుండానే ఎందుకు తిరిగొచ్చారు?" అడిగాడు కృష్ణమూర్తి.

"అదే నేను చేసిన పొరబాటు.. నువ్వెంతగా చెప్పున్నా, వినకుండా ఉన్న ఇల్లమ్ముకుని, కొడుకులిద్దరూ రమ్మనటం నిజమనుకుని తీరా... వెళ్లాక..... కనీసం ఏర్‌పోర్టుకొచ్చి రిసీవ్ చేసుకోలేనంత బిజీ జీవితాన్ని కొడుకులు గడుపుతున్నారని, వాళ్లు మా కోసం టైమ్‌వేస్టు చేయలేక.. మనుషుల్ని అరేంజ్ చేయటంతోనే బోధపడింది అక్కడ మేం గడపబోయే జీవితం ఎలా ఉంటుందో...


మొదట.. టెక్సాస్‌లో ఉంటున్న పెద్దబ్బాయి రవీంద్ర దగ్గరికెళ్లాం. వెళ్లిన రెండ్రోజులకే, 'యాంత్రిక జీవితానికి అలవాటుపడ్డ కొడుకు కోడలు దగ్గర... మేం స్వతంత్రం కోల్పోతున్నామని బోధపడింది. రవీంద్ర భార్య సవిత. ఇంటర్నెట్ ద్వారా కుదిరిన సంబంధం. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఇద్దరికీ ఉద్యోగాలు. మూడేళ్ల కొడుకు, రెండేళ్ల కూతురు వాళ్లకి. వాళ్లు పుట్టాక మొదటిసారి మమ్మల్ని చూసి, మా దగ్గరకే రావడానికి భయపడ్డ పిల్లలు, నాల్రోజుల్లో మమ్మల్ని అతుక్కుపోయారు.

మేం వెళ్లిన వారం రోజులకి డెట్రాయిట్‌లో ఉంటున్న రెండో కొడుకు నాగేంద్ర వచ్చాడు. వాడి భార్య మైథిలి.. ప్రెగ్నెంటట. డాక్టరు ప్రయాణం చెయ్యొద్దన్నాడని తీసుకురాలేదట. మైథిలి, నాగేంద్ర ఇద్దరూ ఒకేచోట పన్జేస్తారట. పెద్దకొడుకు

రవీంద్రకి నా చెల్లెలు కూతురు లక్ష్మినిచ్చి పెళ్లి చేద్దామనుకున్నా, చివరి నిమిషంలో రవీంద్ర తన పెళ్లి గురించి చెప్పడంతో అంగీకరించక తప్ప లేదు. లక్ష్మిని రెండో కోడలిగా నాగేంద్రకిచ్చి చేద్దా మనుకున్నా మా నిర్ణయం అమలుకాలేదు. మైథిలిని పెళ్లి చేసుకున్న మూన్నెళ్లకి నింపాదిగా ఇంటర్‌కాస్ట్ మ్యారేజ్ చేసుకున్నానని మాకు తెలియజేశాడు నాగేంద్ర.

మమ్మల్నిద్దరినీ చూసి కొడుకులిద్దరూ సంతోషించినందుకు సంబరపడ్డాం. ఇండియా వదిలి, పర్మినెంట్‌గా వాళ్లతో ఉండాలనుకుంటున్న మా నిర్ణయం విని, వాళ్ల మొహాల్లో మార్పులు రంగులు మారసాగాయి. ఆ రోజు మధ్యాహ్నం.. భోజనాలయ్యాక నాగేంద్ర సంభాషణ మొదలెడుతూ..

"ఎందుకు నాన్నా! హైదరాబాద్‌లో ఇల్లమ్మేసి ఇంత దూరం వచ్చారు? మేం పుట్టి పెరిగిన ఇల్లది. ఇప్పుడు కావాలంటే మళ్లీ కొనగలమా? ఏదో ఓ ఆర్నెళ్లు ఒకళ్ల తర్వాత ఒకళ్లొచ్చి అమెరికా చూసెళ్తే సరిపోయేది! అయినా... ఉన్న ఇల్లమ్ముకుని ఇక్కడకి రావాల్సినంత అవసరమేం వచ్చిందిప్పుడు?"



"రవీంద్ర నీకు చెప్పలేదా? మీరిద్దరూ ఇష్టపడ్డాకే గదా! మేం వొచ్చింది. ఏరా! రవీ!" అంది ఆవేశంగా జానకి.

రవీంద్ర, తమ్ముడి వైపు తిరిగి "నీకూ.. చెప్పాను గదరా!" అనేసరికి..

"ఏదో జోక్ చేస్తున్నావనుకున్నా.. ఎందుకంటే అమ్మ సంగతి నాకు బాగా తెలుసు. ఆ ఇంటి మీద అమ్మకి ఉన్న మమకారం ఇల్లు అమ్మనివ్వద్దని నాకు గట్టి నమ్మకం. అయినా అమ్మ ఇష్టానికి వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యని నాన్న, ఇల్లమ్మి, బలవంతంగా అమ్మని ఇక్కడికి తీసుకొస్తాడని ఎక్స్‌పెక్ట్ చేయలేదు."

నాగేంద్ర మాటలకి నేనూ జానకి మొహమొహాలు చూసుకున్నాం. మేం అమెరికా రావడానికి అన్ని ఏర్పాట్లూ చేసి, తమ్ముడు ముందు తెలివిగా తప్పించుకున్న పెద్దకొడుకునీ, అన్న ముందు అతి తెలివిగా మాట్లాడిన చిన్నకొడుకునీ ఏమీ అన్లేక పోయాం.

ఆ రోజు రాత్రి...

"అమ్మా! రేపు మార్నింగ్ ఫ్లైట్‌కి వెళ్తున్నా. మైథిలి ప్రెగ్నెంట్ కదా! ఒంటరిగా ఉంటుంది. ఈ సమయంలో నువ్వు తనకి తోడుగా ఉండాలని ఆశపడుతోంది. మీ ఇద్దర్నీ తీసుకురమ్మని మరీమరీ చెప్పింది. మీరు రేపు నాతో బయల్దేరుతున్నారు'' అన్నాడు నాగేంద్ర.

"అదేంట్రా! అమ్మానాన్నలు ఇప్పుడేగా వచ్చింది. ఇక్కడ కొన్నాళ్లుండనీ.. మైథిలి డెలివరీకి ఇంకా టైముందిగా. రెణ్నెళ్లాగి వస్తార్లే'' అని రవీంద్ర అన్నాడు.

కొడుకులు కురిపిస్తున్న ప్రేమ వర్షంలో తడిసి ముద్దయిన జానకి "పిచ్చి సన్నాసులు. మధ్యాహ్నం ఏదో అన్నారని అపార్థం చేసుకున్నారు.. ఇప్పుడు చూడండి'' అన్నట్లు చూసింది పక్కనున్న భర్తవైపు..

"ఇందులో ఏదో అపశ్రుతి ఉందని, కొడుకుల అభిమానాన్ని, అభిమతాన్ని మొదటిసారి శంకించింది విశ్వనాథం మనస్సు. ఇంతలో రవీంద్ర భార్య సవిత అందుకుని, "మీరిద్దరూ అత్తయ్య, మామయ్యని మా దగ్గరుండాలంటే, మా దగ్గరుండాలని వాదులాడుకునే కంటే.. కొన్నాళ్లు మామయ్యని మాతోనూ, అత్తయ్యని నీతోనూ తీసుకెళ్లు నాగేంద్రా!'' అంది మరిది వైపు తిరిగి.

ఎంతో సంబరపడిపోతూ.. "మా మట్టిబుర్రలకి తట్టలేదీ ఐడియా! మీరే మంతారమ్మా, చెప్పండి నాన్నా'' అన్నాడు నాగేంద్ర.

"ఇంకా మేం చెప్పేందుకేముందా! మీరు చెప్పింది వినడం తప్ప'' అనేసరికి భర్తవైపు చూసింది జానకి.

ఆ చూపుకి అర్థం 'మౌనం' అని అర్థమైన విశ్వనాథం నోరు విప్పలేదు.

"సరేనమ్మా! రేపే మన ప్రయాణం. నీ లగేజీ సర్దుకో'' అని వెళ్లాడు నాగేంద్ర. ముప్పై రెండేళ్ల సుదీర్ఘ వైవాహిక జీవితంలో ఏనాడూ ఒకళ్లని విడిచి మరొకళ్లుండని తమని అమెరికాలో కొడుకులు పంచుకుని ఇద్దర్నీ విడదీయటం... అన్వయించుకోలేక.. ఆ రాత్రంతా నిద్రపోలేదు విశ్వనాథం, జానకిలు.

* * *

మర్నాడుదయం.. నాగేంద్రతో బయల్దేరింది జానకి. డెట్రాయిట్లో చిన్న కొడుకు ఇల్లు చూసి అబ్బురపడ్డది జానకి. కోడలి కోసం తెచ్చిన వస్తువులు ఆమెకి చూపుతుంటే, అయిష్టంగా "ఆ..ఊ...'' అని మైథిలి తలాడిస్తుంటే, జానకి మనస్సు చివుక్కుమంది.

* * *

ఉదయం నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకొచ్చి వేడివేడి ఫిల్టర్ కాఫీ ఇద్దరూ కలిసి తాగుతూ, న్యూస్‌పేపరు జానకితో కలిసి చదివే అలవాటున్న విశ్వనాథానికి, విరుద్ధంగా, ఆలస్యంగా నిద్రలేచి, వాళ్ల టైం ప్రకారం సవిత కాఫీ తెచ్చిచ్చేసరికి, కాఫీ మీద ఇచ్ఛ చచ్చిపోయింది విశ్వనాథానికి.

స్నానం చేసి, కాస్సేపు పూజ చేసుకోవడానికి అంత పెద్ద ఇంట్లో చిన్న దేవుని గది కాదు గదా.. కనీసం దేవుడు పటం కూడా లేకపోవటం ఇబ్బందిగా అనిపించి, అదే మాట కొడుకుని అడగ్గా, "అవన్నీ ఇక్కడెలా కుదురుతాయి నాన్నా! సర్దుకుపోవాలి'' అని తేలిగ్గా తీసేయటంతో.. ఇన్నేళ్లూ అంటిపెట్టుకున్న పూజాపునస్కారాలకి ఓ మనో నమస్కారం పెట్టుకోవటంతో సరిపెట్టుకున్నాడు విశ్వనాథం.

దినచర్య కుదింపుతోబాటు, ఆహారపు అలవాట్లకూ అడ్జస్టవ్వాల్సిన పరిస్థితి ఎదురయింది. ఉదయం పిల్లలూ, పెద్దలూ తినే బ్రెడ్డూ, జామూ... మధ్యాహ్నం కోసం కోడలు వచ్చీరాని వంటతో తన కోసం చేసిపెట్టే వంటల్ని, మధ్యాహ్నం వేడిచేసుకుని ఒంటరిగా తినటం, రోగానికి వేసుకునే మందులా మొండికేస్తుంటే ఈ కష్టాలకి కారణం తనే గాబట్టి, సరిపెట్టుకోవటం అలవాటైంది. రాత్రిపూట కొడుకూ, కోడలూ పిల్లలూ తినే ఫాస్ట్‌ఫుడ్డూ పిజ్జా, బర్గర్లూ తినటం అలవాటు లేని విశ్వనాథం... రాత్రి భోజనం మర్చిపోయి, క్రమంగా రెండుపళ్లు తింటూ, అర్ధాకలికి అలవాటు పడిపోయాడు.

* * *


చిన్న కొడుకు ఇంట్లో జానకి పరిస్థితీ దాదాపుగా అంతే.. వెళ్లిన మరుసటి రోజే.. కొడుకూ, కోడలూ గదిలో మాట్లాడుకుంటున్న మాటలు.. జానకి చెవిన బడి మనస్సు వికలం చేశాయి. మైథిలి తల్లి ఇండియాలో ఉంటున్న పెద్ద కూతురు డెలివరీకి వెళ్లిందనీ, ఆమె రావడానికి ఇంకో ఆర్నెల్లు పడుతుందనీ, అప్పటిదాకా మైథిలికి తోడుగా ఉంటుందని తల్లిని తీసుకొచ్చినట్టు నాగేంద్ర భార్యకి సర్దిచెప్తూ.

"రవీంద్ర పిల్లలు చిన్నవాళ్లు గదా! వాళ్లిద్దరూ ఆఫీసులకెళ్తే ఈ ఆర్నెలలూ మా నాన్న ఇంట్లో ఉండి చూసుకుంటూంటాడు. ఈ లోపల మీ అమ్మగారు



## ఈషా దశ తిరిగేనా?

హేమమాలిని పెద్ద కూతురు ఈషా డియోల్ సినిమాల్లోకి వచ్చి ఐదారేళ్లు అవుతున్నా ఇంకా తనదైన గుర్తింపు రాలేదనే చెప్పాలి. కూతురి కెరీర్ దిద్దటానికి రంగంలోకి దిగాలనుకుంటోందిట హేమమాలిని. సొంతంగా ఓ సినిమాని ఈషా నాయికగా నిర్మించాలని హేమమాలిని ఆలోచిస్తోంది. మంచి స్క్రిప్ట్, దర్శకుడి అన్వేషణలో ప్రస్తుతం హేమమాలిని బిజీగా వుందిట. ఇప్పటికైనా ఈషా కెరీర్ మలుపు తిరుగుతుందేమో?



రాగానే మా అమ్మని అన్నయ్య దగ్గరకి పంపించేద్దాం...'' అందాకా కాస్త అడ్జ స్టవ్వు'' అన్నాడు బ్రతిమాల్తూ.

"ఖచ్చితంగా ఆర్నెళ్ల తర్వాత పంపెయ్యాలి.''

"అలాగే''

"అలాగే అనటం కాదు'' మైథిలి గొంతులో కమాండింగ్.

"ఆమె నా కన్నతల్లి... అంత ఖచ్చితంగా....''

"అందుకే మా డాడీ నువ్వడగకపోయినా డౌరీ ఘనంగా ఇచ్చింది. ఎందుకో తెలుసా! నాకు ఇష్టం లేని ఏ పనీ నువ్వు చెయ్యకూడదని'' మైథిలి మాటలు నాగేంద్రని శాసిస్తున్నట్టు వినిపిస్తున్నాయి.

ఆ మాటలు విన్న జానకికి చిన్న కొడుకు మీద పెంచుకున్న మమకారం ప్రాకారాలు దూకి పారిపోతున్నట్టనిపించింది. ఆ రాత్రి జానకికి ఎంతకీ నిద్ర పట్టలేదు. ఇక్కడ తనెలాగైనా సర్దుకుపోగలదు. కానీ అక్కడ భర్త ఎలా ఉన్నాడో... అని తెల్లవార్లూ ఆలోచిస్తూనే ఉంది.

* * *

ఎప్పుడూ ఉల్లాసంగా పదిమందిలో మాట్లాడుతూ యాక్టివ్‌గా ఉండే విశ్వ నాథంలో నెలరోజులకే.. స్థబ్ధత చోటుచేసుకుంది. ఏదో వేళకి తినటం, టీవీలో, పుస్తకాలతో కాలక్షేపం చేస్తున్నా, కాలాన్ని కిల్ చెయ్యటం కష్టంగా మారింది.

భార్యకి ఫోన్ చేసినా.. తనిక్కడ సంతోషంగా ఉన్నట్టు చెప్పేవాడు. ఇంట్లో తనో పెద్దవాడిని ఉన్నట్టు, యాంత్రిక జీవనంలో యంత్రాల్లా మారిన కొడుకూ కోడలికి గుర్తు లేకపోవటం.. తన స్వయంకృతాపరాధం అనుకునే వాడు.

* * *

ఆ రోజు మైథిలి తండ్రి, ఆయన ఫ్రెండ్సూ వస్తున్నట్టు ఫోన్ చేయడంతో, మైథిలి ఆఫీస్‌కి వెళ్లకుండా, ఉదయం నుండి అత్తగారి చేత అడ్డమైన చాకిరీ చేయించింది. తండ్రి తనకి అర్జెంటు పని ఉందని, ఆ రోజు రావటం లేదని ఫోన్ చేయడంతో మైథిలి నిరాశగా వెళ్లి పడుకుంది. నాగేంద్ర ఆఫీసు కెళ్లిపో యాడు. పని భారం వల్ల అలిసిపోయిన జానకి హాల్లో సోఫాలో పడుకుని టీవీ ఆన్ చేసింది. వెనుక నుండి ఎప్పుడొచ్చిందో గానీ, మైథిలి అత్తగార్ని చూసి

"ముందా సోఫాలో నుండి లేవండి! దాని ఖరీదెంతో తెలుసా మీకు? లక్షలు పోసి కొన్నది. మీరిలా పల్లెటూళ్లో మంచాన్ని వాడినట్టు వాడటానికి కాదు.'' అని విసురుగా అనేసరికి, బ్రాన్పడిపోయిన జానకి చివాల్న లేచి లోపలికె ళ్లింది. సాయంత్రం ఇంటికొచ్చిన నాగేంద్ర, మైథిలి చెప్పింది విని, గదిలో ఉన్న తల్లి దగ్గరకొచ్చి.

"అమ్మా! గదిలో ఒంటరిగా ఏం చేస్తున్నావు? ఉదయం నాన్నతో మాట్లా డాను.. బాగా ఉన్నారట.'' అని.

"అమ్మా! ఇక్కడ ఇండియాలో లాగా ఉండాలంటే ఎలా కుదురుతుంది. మైథిలి ఇక్కడే పుట్టి పెరిగింది కాబట్టి. ఇల్లు శుభ్రంగా ఉంచుకోవాలనుకుం టుంది. ఆ సోఫా రెండు లక్షలు పెట్టి కొన్నది. దానిమీద నువ్వెందుకు పడుకు న్నావు చెప్పు'' అనేసరికి..

"తప్పయిందిరా! క్షమించమని నీ భార్య కాళ్లు పట్టుకోనా? లేక నీ కాళ్లు పట్టుకోనా?'' అంది జానకి కోపంగా.

తల్లి కోపం చూసి నాగేంద్ర మౌనంగా అక్కణ్నుంచి లేచెళ్లిపోయాడు.

* * *

విశ్వనాథానికి చెయ్యడానికేం పన్లు లేక, ఆలోచన్లెక్కువై మానసికంగా అల సిపోతుంటే జానకికి పనెక్కువై, ఆలోచించే వ్యవధి లేక శారీరకంగా విశ్రాంతి కోరుకుంటోంది. కాలం మాత్రం ఎవరితో నిమిత్తం లేకుండా ఆర్నెళ్లు గిర్రున తిరిగొచ్చాయి. మైథిలి తల్లి ఇండియా నుండి తిరిగి రాగానే, జానకికి తను వచ్చిన పనైపోయిందని అర్థమయింది. ఒక్కరోజు ఎక్కువున్నా ఎక్కసం అవు తాననుకుని, ఆ సాయంత్రమే కొడుక్కి చెప్పి, టెక్సాస్‌కి బయల్దేరింది.

* * *

ఆర్నెలలు నిర్జీవంగా, భారంగా గడిపిన విశ్వనాథానికి భార్యని చూసేసరికి ఫౌంటెన్లో ఉప్పొంగే నీళ్లలా... కళ్లు తడి కావటంతో మనసు తేలికబడ్డది.

"అమ్మా! మేం ఇద్దరం ఉద్యోగాలకెళ్లటం వల్ల నాన్నకి సరైన కంపెనీ ఇవ్వ లేకపోయాం. నువ్వొచ్చావు. ఇహ నాన్నకి దిగుల్లేదు'' అన్నాడు రవీంద్ర. కోడలూ ఆమాటే అంది.

"లేదు రవీ! మేం త్వరగా ఇండియా వెళ్లిపోతాం. మాకు ఫ్లైట్ టికెట్స్ బుక్ చెయ్'' అని జానకి అనేసరికి.

"మళ్లీ ఎందుకమ్మా వెళ్లటం. ఇక్కడ ఉందామనేగా వచ్చారు?''

"అనుకునే పొరపాటు చేశాం. ఎక్కడి వాళ్లు అక్కడుంటేనే మర్యాద,


## టమేటా పండు ఘనత

టమేటాని అంతా వెజిటబుల్‌గానే పరిగణిస్తారు కానీ బొటానికల్‌గా దీన్ని పండుగా భావించాలంటున్నారు వృక్ష శాస్త్రజ్ఞులు. ప్రపంచంలో **అత్య ధికంగా (6 కోట్ల టన్నులు) పండే పళ్లివి. తర్వాత స్థానం అరటిపళ్లది (4.4 కోట్ల టన్నులు), మూడవ స్థానం ఆపిల్స్‌ది (3.6 కోట్ల టన్నులు), నాలుగ వది ఆరెంజ్‌ది (3.4 కోట్ల టన్నులు), ఐదవ స్థానం పుచ్చకాయలది (2.2.**



**కోట్ల టన్నులు). టమేటాలని మెక్సికోలోని అజెక్ జాతి వాళ్లు క్రీ.శ.700లలో మొదటిసారి పండించారుట. ఆ తరువాత అది 1556లో యూరప్‌కి చేరింది. ఫ్రెంచ్‌వారు దాన్ని 'ఆపిల్ ఆఫ్ లవ్' అని, జర్మన్ వారు 'ఆపిల్ ఆఫ్ పేరడైజ్' (స్వర్గం నుంచి దిగి వచ్చిన ఫలం) అని పిలిచేవారుట.**

**-విమల**



గౌరవం, ఆప్యాయత, అనురాగం అంటిపెట్టుకుని ఉంటాయి. లేకపోతే.. ఆత్మాభిమానం చంపుకుని, ఆత్మన్యూనతతో జీవచ్ఛవాల్లా బ్రతుకీడాల్సొస్తుంది మాలాంటి వాళ్లు. ఆ దుస్థితి రాకముందే వెళ్లిపోతాం" అంది జానకి దృఢంగా.

"ఇండియాలో ఇల్లు కూడా లేదు గదమ్మా!"

"పిల్లలెన్ని తప్పులు చేసినా అమ్మ ఒడిలో ఎప్పుడూ.. ఇంతే స్థలం ఉంటుంది. మేం తప్పు చేశాం. పుట్టి పెరిగిన మాతృభూమి మా తప్పుల్ని మన్నించి, మేం ఉండటానికింత నీడ ఇవ్వకపోతుందా!"

"నాన్నా! అమ్మకి మీరైనా చెప్పండి."

"మీ అమ్మ మాట... జీవితంలో ఒకేఒక్కసారి విననందుకేరా! ఈ ఆర్నెలలూ.. మాకీ అమెరికా అరణ్యవాసం."

రవీంద్ర గబగబా ఫోన్‌లో నాగేంద్రని కాంటాక్టు చేశాడు. నాగేంద్ర తల్లితో మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా, జానకి ఇష్టపడలేదు. మర్నాడు నాగేంద్ర వచ్చాడు. అన్నదమ్ములిద్దరూ ఎంత బ్రతిమాలినా... జానకి నిర్ణయం మార్చుకోలేదు. రెండ్రోజుల తర్వాత.. రవీంద్ర ఫ్లైట్ టిక్కెట్స్‌తో బాటు రెండు లక్షల చెక్ ఇవ్వబోతుంటే, టికెట్స్ తీసుకుని, చెక్ తిరిగిస్తూ..

"దేన్నైనా డబ్బుతో కొనగల స్థోమత ఇప్పుడు మీకున్నా.. మిమ్మల్ని కన్న తల్లిదండ్రులుగా మా కన్న ప్రేమని రెండు లక్షలకి మీకు అమ్ముకునే దుస్థితి మాకింకా రాలేదు. రాబోదు.. ఎందుకంటే, మాలో ఇంకా ఆత్మాభిమానం బ్రతికే ఉంది" అంది జానకి.

* * *

చెప్పటం ముగించిన విశ్వనాథంతో..

"నువ్వేం దిగులు పడకు. నీకు మేం ఉన్నాం. మిగిలిన విషయాలు రేపు మాట్లాడదాం" అని కృష్ణమూర్తి స్నేహితుడి భుజం తట్టడంతో గుండెల నిండా గాలి పీల్చుకుని పడుకున్న విశ్వనాథానికి వెంటనే నిద్ర పట్టింది.. చాలాకాలం తర్వాత.

* * *

కృష్ణమూర్తి, విశ్వనాథం కలిసి షంషాబాద్ దగ్గర పదేళ్ల క్రితం ఐదువేలకి కొన్న స్థలం.. ఏర్‌పోర్టు పుణ్యమా? అని హాట్‌కేక్‌లా డెబ్బై ఐదు లక్షలకి అమ్ముడుపోయింది. కృష్ణమూర్తి ఇంటి పక్కనే కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్లో విశ్వనాథానికి, జానకిలకు ఓ ఫ్లాట్ కొనిపెట్టాడు.

* * *

సరిగ్గా రెండేళ్ల తర్వాత...

కాలింగ్ బెల్ శబ్దానికి తలుపు తీసిన విశ్వనాథానికి కొడుకులిద్దరూ ఎదురుగా కనిపించేసరికి.. ఆశ్చర్యపోయి "రండ్రా!" అన్నాడు ముక్తసరిగా.

"జానకీ! ఎవరొచ్చారో చూడు" అని భార్యని పిలిచే లోపలే లోపలకొచ్చి కూచున్నారిద్దరూ.

"ఏం నాన్నా! కొడుకులిద్దరూ పోయారనుకున్నారా?"

"అవన్నీ ఎందుకు లేరా! మీ భార్యాపిల్లలు ఎక్కడ?"

"హోటల్ రూంలో ఉన్నారు" చెప్పాడు రవీంద్ర.

"నాన్నా! అమ్మేది? ఎక్కడ ఉంటున్నారో తెలీదు. కనీసం ఫోన్ నెంబరు కూడా తెలీదు. మేమేం తప్పు చేశామని మీరిద్దరూ స్ట్రైక్ చేస్తున్నారు?" ఆవేశంగా అన్నాడు నాగేంద్ర.

"మేమెలా ఉండాలో, ఎక్కడ ఉండాలో మాకు స్ట్రైకయ్యేట్టు చేశార్రా మీరు" కొడుకులిద్దరినీ చూడడానికి జానకి ఎంతకీ బయటికి రాకపోతుంటే, నాగేంద్ర లేచి లోపలికెళ్లబోతుంటే... వేగంగా బయటికొస్తున్న తల్లి చూసి..

"అమ్మా" అని పిలిచాడు.

కొడుకుల వైపు కన్నెత్తి చూడకుండా.. "ఏవండీ రెడీ అయ్యారా!" అంది.

"అమ్మా! ఏంటమ్మా! ఇటు పిలుస్తుంటే, అటు బదులిస్తావు" అన్నాడు రవీంద్ర.

జానకి బయటికొచ్చి, చెప్పు వేసుకుంటుంటే...

విశ్వనాథం కొడుకుల్తో.. "బాబూ! మేం విజయవాడ వెళ్తున్నాం.. మీరిద్దరూ బయటికొస్తే.. ఇల్లు తాళం వెయ్యాలి" అన్నాడు.

తండ్రి మాటలకిద్దరూ వేగంగా బయటికొచ్చారు. నాగేంద్ర తల్లి ముందుకొచ్చి..

"అమ్మా! నీ మౌనంతో మమ్మల్ని శపిస్తున్నావా?"

"తల్లి పిల్లల క్షేమం కోరుతుంది గానీ శపించదు" అని వాళ్లకి చెప్పి "త్వరగా బయల్దేరండి" అంది భర్తతో.

వెళ్లిపోతున్న తల్లిదండ్రుల వైపు అవాక్కయి చూస్తూ నిలబడ్డారు అన్నదమ్ములిద్దరూ.

★



## నో...ఐటమ్ నంబర్లు

టాప్ హీరోయిన్లు సైతం ఐటమ్ నంబర్లు చేస్తున్న ట్రెండ్ ప్రస్తుతం అన్ని భాషా సినిమా రంగాల్లో నడుస్తోంది. కానీ త్రిష మాత్రం ఐటమ్ సాంగ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయనంటోంది. ఎంత పెద్ద బ్యానర్ అయినా, దర్శకుడైనా, భారీ రెమ్యునరేషన్ అయినా ఐటమ్ నంబర్లు చేసే ప్రశ్నే లేదు అని ఖరాఖండీగా చెబుతోంది త్రిష. ఆమె అన్న మాట మీద నిలబడాలని త్రిష అభిమానులు కోరుకుంటున్నారు.

